క్లుప్తంగా

పారదర్శకంగా భూముల రీసర్వే



కోకిలంపాడు(తిరువూరు): భూముల రీసర్వే పారదర్శకంగా జరుగుతున్నందున రైతులు సహకరించాలని తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి మాధవి కోరారు. మండలంలోని కోకిలంపాడులో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న భూములకు గతంలో ఉన్న సర్వే రాళ్లను ఆధారంగా చేసుకుని రీసర్వే కొనసాగించాలని సిబ్బందిని ఆదేశించారు. తిరువూరు తహసీల్దారు సురేష్‌బాబు, డివిజనల్ సర్వేయర్ సారంగపాణి పాల్గొన్నారు.

బీమా సొమ్ము రూ.లక్ష అందజేత



గుళ్లపూడి(గంపలగూడెం): గంపలగూడెం మండలం గుళ్లపూడి సొసైటీ సభ్యురాలు రాచబంటి సావిత్రి(53) ఇటీవల మృతి చెందగా మంజూరైన బీమాసొమ్ము రూ.లక్షను ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. సొసైటీ వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ మొత్తాన్ని మృతురాలి కుమారుడు రాచబంటి వెంకయ్యకు పీఏసీఎస్ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకులు పోట్రు శశాంక్ అందజేశారు. సొసైటీ సిబ్బంది బత్తిన వాసు, వైఎస్సార్ సీపీ నాయకుడు దొడ్డా గోపాలరావు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో మెరుగైన వైద్యం



రెడ్డిగూడెం: జగనన్న ఆరోగ్య సురక్షతోనే పేదలకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కరరెడ్డి అన్నారు. మండలంలోని రుద్రవరంలో నిర్వహించిన జగనన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తినీ ఆరోగ్యపరంగా ఉంచడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొలగాని తిరుపతిరావు, భీమిరెడ్డి కృష్ణారెడ్డి, సర్పంచ్ జరబాల చాందీ, కిలావత్ అమ్మ, ఎంపీడీఓ విష్ణు ప్రసాద్, డాక్టర్ చెన్నకేశవ నాయక్, పంచాయతీ సెక్రటరీ రంగారావు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం



ముసునూరు: అనారోగ్యం, ప్రమాదాల కారణంగా సంఘ సభ్యులు అకాల మృతి చెందితే తమ సహకార సంఘం తక్షణ సాయం అందించి ఆ కుటుంబాన్ని ఆదుకుంటుందని కొర్లగుంట వ్యవసాయ సొసైటీ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు పేర్కొన్నారు. ఇటీవల మృతి చెందిన సంఘ సభ్యుడు వన్నెకూటి సుందరరావు కుటుంబానికి సహకార సంఘం, కేడీసీసీ బ్యాంకు తరపున రూ.10,000 సాయాన్ని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎన్. సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్, చెక్కపల్లి సొసైటీ అధ్యక్షుడు కె.రాజానాయన, సొసైటీ కార్యదర్శి కె.పార్వతి పాల్గొన్నారు.

సాగర్ జలాలు విడుదల చేయాలని వినతి

తిరువూరు: తిరు వూరు నియోజకవర్గంలోని 2, 3 జోన్లలో ఖరీఫ్ పంటలు వర్షాభావం కారణంగా ఎండిపోతున్నందున సాగర్ జలాల విడుదలకు చర్యలు తీసుకోవాలని గంపలగూడెం మాజీ ఎంపీపీ కోట దాసు తిరువూరు ఆర్డీఓ మాధవికి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ప్రతి సంవత్సరం అక్టోబర్, నవంబర్ నెలల్లో సాగర్ జలాలను ఎడమ కాలువకు విడుదల చేస్తున్నప్పటికీ దిగువ భూములకు నీరందని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. దామాషా ప్రకారం 2,3 జోన్లకు నీరు వదిలే విధంగా ఖమ్మం జిల్లా సాగర్ అధికారులను సంప్రదించి రైతుల సమస్య పరిష్కరించాలని ఆయన కోరారు.

పేకాట శిబిరంపై దాడి

చాట్రాయి: బూరుగుగూడెం శివారు మామిడి తోటలో శుక్రవారం పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్సై చెప్పారు. జూదరుల నుంచి నుంచి రూ.22,300, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



ట్రిపుల్‌ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతిని అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: పదో తరగతిలో ప్రతిభ కనబరిచి ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆకాంక్షించారు. నియోజకవర్గం పరిధిలో ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన 20 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ ప్రోత్సాహకంగా రూ.5 వేల నగదును, జ్ఞాపికలు, మిఠాయిలు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీల్లో సీటు సాధించిన వారంతా ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నత రంగాల్లో రాణించాలన్నారు. దీని ద్వారా నూజివీడు నియోజకవర్గంతో పాటు ట్రిపుల్ ఐటీలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. 2006లో వైఎస్ రాజశేఖరరెడ్డి నూజివీడు వచ్చినప్పుడు ట్రిపుల్ ఐటీలను ప్రకటించి ఇక్కడ శంకుస్థాపన చేశారన్నారు. కేవలం ఒక్క ఏడాదిలోనే ఇక్కడ నిర్మాణాలను పూర్తిచేసి 2008లో ప్రారంభించినట్టు తెలిపారు. ఎంతో ప్రతిభ కలిగిన అధ్యాపకులు ట్రిపుల్ ఐటీల్లో ఉన్నారని, వారు నిరంతరం విద్యార్థులను ఉన్నతికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నూజివీడు పట్టణ, ముసునూరు మండల అధ్యక్షుడు శీలం రాము, మూల్పూరి నాగవల్లేశ్వరరావు, క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, నాయకులు రవీంద్రరెడ్డి, వాసు, గోపాలకృష్ణ, మున్షీ, కౌన్సిలర్ మీర్ అంజాద్ ఆలీ, పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్, జెడ్పీ బాలికల హైస్కూల్ హెచ్ఎంలు బీ హేమలత, డీ సత్యనారాయణ, ముసునూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం



విద్యార్థులను అభినందిస్తున్న సమగ్ర శిక్ష పీడీ బీ శ్రీనివాసరావు

ఆగిరిపల్లి: దేహ దారుఢ్యానికి, శరీర ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తోటపల్లిలోని హీల్ ప్యారడైజ్ స్కూల్‌ను గురువారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రాఫ్ట్ వర్క్, అభ్యసనా ప్రక్రియలు విద్యార్థులలో సృజనాత్మకతతో పాటు సుహృద్భావ పోటీని పెంచుతాయన్నారు. ఇటీవల నిర్వహించిన అంతర్రాష్ట్ర సీబీఎస్ఈ అండర్19 పోటీల్లో యోగా, వాలీబాల్, కబడ్డీ విభాగాలలో బంగారు, వెండి పతకాలు సాధించడంతో పాటు జాతీయ పోటీలకు ఎంపికైన బాలబాలికలను ఆయన అభినందించారు. హీల్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేరు సత్య ప్రసాద్, సీఈవో కూరపాటి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్లో ఓపెన్‌హౌస్



తిరువూరు పోలీసుస్టేషన్లో ఓపెన్‌హౌస్ నిర్వహిస్తున్న సీఐ

తిరువూరు: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా స్థానిక పోలీసుస్టేషన్లో శుక్రవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం జరిగింది. పోలీసుశాఖ విధులు, పోలీసుస్టేషన్లో నిర్వహించే రికార్డులు, ఆయుధాలు, లాకప్ తదితర వివరాలను సీఐ అబ్దుల్‌నబీ విద్యార్థులకు వివరించారు. పోలీసులు శాంతిభద్రతలు, ట్రాఫిక్ విధి నిర్వహణలో వ్యవహరించే విధానాన్ని తెలిపారు. నేరాల నియంత్రణకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేసే తీరు, వైర్‌లెస్, కంప్యూటర్ల గురించి వివరించారు.

మద్యం సీసాల స్వాధీనం

తెలంగాణ రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా తిరువూరు సమీపంలోని సరిహద్దు చెక్‌పోస్టు వద్ద శుక్రవారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న మల్లేల గ్రామానికి చెందిన దారావత్ శ్రీనునాయక్, శెట్టిపల్లి రాజేశ్వరరావుల నుంచి 27 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు.

పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు

ఆగిరిపల్లి: పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఎస్సై నంబూరు చంటిబాబు ఓపెన్ హౌస్‌ను నిర్వహించారు. ఇందులో భాగంగా హైస్కూల్ విద్యార్థులకు పోలీస్‌స్టేషన్‌లో నిర్వర్తించే విధులపై అవగాహన కల్పించారు.

నేటి నుంచి అతావుల్లా బాబా ఉరుసు మహోత్సవాలు



విలేకరులతో మాట్లాడుతున్న దర్గా పీఠాధిపతి ఖాజా మొహియుద్దీన్

ఎ.కొండూరు: మండలంలోని చీమలపాడు బాబె బొగ్దాద్ అస్థాన అతాయె మహమ్మద్ తాజ్ ఖాద రియా దర్బార్‌లో అలుపెరగని అన్నదాత మహనీయులు సూఫీ మహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి బాబా ద్వితీయ పావన సూఫీ సుగంధ ఉరుసు మహోత్సవాలు 28, 29, 30 తేదీలలో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు దర్బార్ పీఠాధిపతి బాబా తనయుడు మహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ తెలిపారు. దర్గాలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 28వ తేదీన దివ్య ఖురాన్ పఠనం, సూఫీ ఉరుసు మహోత్సవం ప్రారంభం, గుసుల్ షరీఫ్, 29న ఉరుసు గంధం, అమ్మజాన్ దర్గాలో పవిత్ర పుష్పాంజలి, చాదర్, గంధం సమర్పణ, సూఫీ సుగంధ సందల్, మహా ఊరేగింపు, పవిత్ర జెండా ప్రతిష్ఠాపన, 30వ తేదీన దీపారాధన, పీఠాధిపతి ఆ ధ్యాత్మిక సందేశం, ఉరుసు ముగింపు కార్యక్రమా లు ఉంటాయని పేర్కొన్నారు. మూడు రోజుల పా టు ఉదయం, సాయంత్రం నిరంతర దివ్య మహా అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉరుసు మహోత్సవానికి దేశంలో దేశ, విదేశాల్లో ఉ న్న బాబా భక్తులు పాల్గొని బాబా వారి దివ్యసమా ధిని దర్శించుకుని వారి దీవెనలు, ఆశీస్సులు పొందాలని కోరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందు లు కలగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నా మని తెలిపారు. విజయనగరం ద ర్బార్ పీఠాధిపతి మహమ్మద్ ఖాలీల్‌బాబు, మహమ్మద్ తాజ్ ఖాదర్‌బాబు, మహమ్మద్ జాఫర్ షరీఫ్ పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాల లీడర్లకు శిక్షణ



మాట్లాడుతున్న ఏపీఎం రామకృష్ణ

ఆగిరిపల్లి: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల లీడర్లకు శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీఎం బొలగాని రామకృష్ణ మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘాల లీడర్ల విధులు, బాధ్యతలను తెలియజేశారు. ప్రతి నెలా రైతు ఉత్పత్తిదారుల సంఘాల గ్రూపు సభ్యులు క్రమం తప్పకుండా పొదుపు జమ చేయాలని, సమావేశాలు నిర్వహించి తీర్మానాలను పుస్తకాల్లో రాసుకోవాలని, దానివల్ల సభ్యుల మధ్య పారదర్శకత పెరుగుతుందన్నారు. వ్యవసాయాధికారి పల్లగాని చెన్నారావు, ఎన్‌పీఎం కోఆర్డినేటర్ అల్ఫాన్సా రాణి, ఎఫ్‌పీఓ సీసీ సీహెచ్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా బతుకమ్మ నిమజ్జనం



ప్రధాన ఆకర్షణగా నిలిచిన పూలపేర్పు



గంపలగూడెం మండలం ఊటుకూరు దక్షిణబజారులో తయారు చేసిన పేర్పులు



చంద్రుపట్లలో బతుకమ్మ వద్ద పూజలు చేస్తున్న మహిళలు

గంపలగూడెం: దసరా సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో నెలకొల్పిన బతుకమ్మ నిమజ్జన కార్యక్రమాన్ని మహిళలు శుక్రవారం కోలాహలంగా నిర్వహించారు. గంపలగూడెం గాంధీసెంటర్, రావిశెట్టుబజారు, రెడ్డి బజారు, రామాలయం గుడివద్ద, గవళ్లబజారు తదితర గ్రామాల్లో అమ్మవార్లను ముందుగా ఊరేగించారు. చివరిరోజు మహిళలు తంగేడు, బంతి పూలతో అందంగా అలంకరించి తెచ్చిన పేర్పులను తీసుకొచ్చి అమ్మవారి వద్ద ఉంచి పూజలు చేశారు.

బతుకమ్మ ఊరేగింపు

చంద్రుపట్ల (విస్సన్నపేట): మండలంలోని చంద్రుపట్ల గ్రామంలో మహిళలు భక్తి శ్రద్ధలతో బతుకమ్మ పూజలు చేసి గురువారం రాత్రి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం నిమజ్జనం చేశారు.

చాట్రాయిలో..

చాట్రాయి: మండలంలోని బీసీ కాలనీలో గురువారం రాత్రి బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా నిర్వహించారు. తంగేడు పూలతో తయారు చేసిన బతుకమ్మను తలపై పెట్టుకుని పాటలు పాడుకుంటూ కోలాటంతో గ్రామంలో ఊరేగించారు. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మైలవరం: మైలవరం గ్రామంలోని 11కేవీ బైపాస్ ఫీడర్ మీద మెయింటెనెన్స్ పనులు నిమిత్తం శనివారం ఈ ఫీడర్ పరిధిలోని పోలీస్ స్టేషన్, తహసీల్దారు కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ కార్యాలయం, ఆల్ఫా హోటల్ నూజివీడు రోడ్, తారకరామానగర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రిసిటీ ఏఈఈ రమేష్ తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపేయనున్నట్లు పేర్కొన్నారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ వెంకయ్య స్వామి ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ (విజయవాడ పట్టణం) బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు వెంకయ్య స్వామి టెంపుల్ ఏరియా, రావూరు అపార్ట్‌మెంట్ ఏరియా, ల్యాంకో కాలనీ ఏరియా, జీఐజీ స్కూల్ ఏరియా, మెగా ఇంజనీరింగ్ ప్లాంట్ ఏరియా, రాధబూ మాధవ్ టింబర్ డిపో ఏరియా, మురళీకృష్ణ టింబర్ డిపో ఏరియా, వీఆర్ఎల్ గోడౌన్ ఏరియాల్లో కరెంట్ నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

అందుబాటులో ఓటర్ల జాబితా

మైలవరం: భారత ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్ అనుసరించి 82-మైలవరం నియోజకవర్గంలో 27-10-2023న ముసాయిదా ఫొటో ఓటర్ల జాబితా అన్ని పోలింగ్ కేంద్రాల్లో పరిశీలన నిమిత్తం అందుబాటులో ఉంచినట్లు సహాయ ఓటర్ల అధికారి ఎం.శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. 01-01-2024 అర్హత తేదీగా 18 సంవత్సరాలు వయస్సు నిండిన పౌరులు నూతనంగా ఓటు హక్కు పొందడానికి ఫారం-6, ఓటు తొలగింపుల కోసం ఫారం-7, ఓటు గుర్తింపు కార్డులో సవరణ, మార్పులు చేర్పుల కోసం, ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరొక కేంద్రానికి అదేవిధంగా ఒక నియోజకవర్గం నుంచి మరొక నియోజకవర్గానికి ఓటు బదిలీ చేసేందుకు ఫారం-8 క్లెయిమ్స్‌ను 27-10-23 నుంచి 09-12-23 వరకు సంబంధిత పోలింగ్ కేంద్రం బూత్ స్థాయి అధికారి ద్వారా, మీసేవా, ఆన్‌లైన్ ద్వారా సమర్పించవలసిందిగా తెలియజేస్తున్నట్లు ఎన్నికల సహాయ అధికారి, తహసీల్దారు శ్రీనివాస్ పేర్కొన్నారు.

తిరువూరులో మహిళా ఓటర్లే అధికం

తిరువూరు: ఓటర్ల జాబితా సవరణ ముసాయిదాను శుక్రవారం తిరువూరు ఆర్డీఓ కార్యాలయంలో విడుదల చేశారు. తిరువూరు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,00,613 మంది ఉండగా, వీరిలో మహిళా ఓటర్లు 1,01,363 మంది, పురుష ఓటర్లు 99,241 మంది ఉన్నారు. ఇతరులు తొమ్మిది మంది ఉన్నారు. మండలాల వారీగా, గంపలగూడెం మండలంలో మొత్తం ఓటర్లు 56,639 మంది, వీరిలో మహిళలు 28,599, పురుషులు 28,039, ఇతరులు-1, తిరువూరు మండలంలో మొత్తం ఓటర్లు 61,158, మహిళా ఓటర్లు 31,162, పురుష ఓటర్లు 29,991 ఉన్నారు. విస్సన్నపేట మండలంలో మొత్తం 45,252 మంది ఓటర్లుండగా, మహిళా ఓటర్లు 22,898, పురుష ఓటర్లు 22,351, ఇతరులు ముగ్గురు, ఏకొండూరు మండలంలో మొత్తం ఓటర్లు 37,564, వీరిలో మహిళలు 18,704, పురుషులు 18,860 మంది ఉన్నారు. గంపలగూడెం మండలంలో 69, తిరువూరు మండలంలో 66, విస్సన్నపేట మండలంలో 56, ఏకొండూరు మండలంలో 43 పోలింగ్ కేంద్రాలున్నాయి.

నేడు అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

విస్సన్నపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయం మీటింగ్ హాల్లో మండల స్థాయి అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఈ సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో విజిలెన్స్ తనిఖీ

ముసునూరు: ముసునూరు రెవెన్యూ కార్యాలయంతోపాటు కాట్రేనిపాడు అటవీ భూముల ఆక్రమణలపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కాట్రేనిపాడుకు చెందిన వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో శుక్రవారం ఏలూరు జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డీఎస్పీ ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయం, కాట్రేనిపాడు అటవీ భూముల్లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాట్రేనిపాడులో అటవీ భూమి 7,242 ఎకరాలు ఉండగా ఆక్రమణ చెరలో ఉన్న భూముల వివరాలను రెవెన్యూ రికార్డుల్లో పూర్తిగా పరిశీలించి, తహసీల్దార్ దాసరి సుధను అటవీ భూముల ఆక్రమణపై ఆరా తీసినట్లు తెలుస్తోంది.

సారా విక్రేత అరెస్టు

ముసునూరు: అక్రమంగా సారా విక్రయిస్తున్నారనే సమాచారంతో దాడి చేసి విక్రేతను అరెస్టు చేసినట్టు ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపారు. వలసపల్లికి చెందిన బొల్లా కీర్తి అక్రమంగా సారా విక్రయిస్తుండగా శుక్రవారం దాడి చేసి, మూడు లీటర్ల సారా డబ్బాను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

నూజివీడు: మండలంలోని సిద్ధార్థనగర్‌లో ఈ నెల 28న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వీపీ విజయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించే ఈ వైద్య శిబిరంలో స్పెషలిస్టు వైద్యులు, గొల్లపల్లి, దిగవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పాల్గొని పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

నేడు గృహసారథుల సమావేశం

చాట్రాయి: బూరుగుగూడెంలో శనివారం మూడు గంటలకు వైఎస్సార్ సీపీ గృహసారథులు, కన్వీనర్ల సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మిద్దె బాలకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు పాల్గొంటారని, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

సచివాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే రక్షణనిధి



గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

ఏ.కొండూరు: గ్రామ సచివాలయాల సేవలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే కె.రక్షణనిధి పేర్కొన్నారు. మండలంలోని గొల్లమండల గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాల వ్యవస్థ ప్రవేశపెట్టి గ్రామాల్లోనే ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ వలంటీర్ల ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి ఎవరి సిఫార్సులు లేకుండా వెంటనే గ్రామ సచివాలయాల ద్వారా మంజూరు చేస్తున్నారన్నారు. మండల కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామాల్లోనే అర్హత ఉంటే ప్రభుత్వ సంక్షేమ పథకాలు వెంటనే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుని, వాటిని వెంటనే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు నూటికి నూరుశాతం అమలు చేస్తూ పలు రకాల పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, జెడ్పీటీసీ భూక్యా గనియా, వైస్ ఎంపీపీ గుంటక శివారెడ్డి పాల్గొన్నారు.

ఈ-క్రాప్ జాబితాలో పేర్లు సరిచూసుకోవాలి



మైలవరంలో జాబితాను ప్రదర్శిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు



ములపాడు సచివాలయంలో ఈ-క్రాప్ నమోదు జాబితా ప్రదర్శిస్తున్న ఉద్యోగులు

మైలవరం: రైతులు ఈ-క్రాప్ జాబితాలో తమ పేర్లు నమోదు అయినదీ లేనిదీ సరి చూసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ ఎం. శ్రీనివాసరావు తెలిపారు. మైలవరం, చంద్రగూడెం గ్రామాలలో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ క్రాప్ జాబితాను సామాజిక తనిఖీ నిమిత్తం అన్ని గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శించినట్లు, ఈ జాబితాను చదివి వినిపించుటకుగాను అన్ని గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించవలసిందిగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 29వ తేదీ వరకు జాబితా అందుబాటులో ఉంటుందని, తర్వాత ఫైనల్ లిస్ట్ ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని తప్పు ఒప్పులను సరిచేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మైలవరం జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.తిరుపతిరావు, చంద్రగూడెం పీఏసీఎస్ ప్రెసిడెంట్ శీలం ప్రతాపరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రావుల రామోజీరావు, మండల వ్యవసాయ శాఖ అధికారి సంధ్యారాణి, వీఏఏలు పాల్గొన్నారు.

జాబితాల ప్రదర్శన

ఇబ్రహీంపట్నం: ఖరీఫ్ సాగులో ఈ-క్రాప్ నమోదు ముగియడంతో పంటల నమోదు అర్హుల జాబితాలు ఆయా గ్రామాల సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాల్లో శుక్రవారం ప్రదర్శించారు. రైతులు జాబితాలు క్షుణ్ణంగా పరిశీలన చేసుకుని నమోదులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 29వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి శైలజ తెలిపారు. నవంబర్ ఒకటిన పూర్తిస్థాయి జాబితా ప్రదర్శన జరుగుతుందని పేర్కొ న్నారు. మండలం వ్యాప్తంగా 2,016 మంది రైతులకు చెందిన 6,728 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు జరగగా, ఈకేవైసీ 1987మంది రైతులకు చెందిన 6,665 ఎకరాల్లో జరిగిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిల్, వీఏఏ సాయికిరణ్ పాల్గొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్ పంటలను ఈ క్రాప్ చేయించుకున్న రైతుల జాబితాను ప్రదర్శించినట్లు వ్యవసాయాధికారి బి.శివశంకర్ తెలిపారు. సచివాలయాల్లో ఈ క్రాప్ రైతుల జాబితాను శుక్రవారం ప్రదర్శించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదు వల్ల ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్టం వాటిల్లితే ప్రభుత్వం పరిహారం అందిస్తుందని ఆయన చెప్పారు. ఈ నెల 30 తేదీ లోగా ఈ క్రాప్ జాబితాను సవరించుకోవచని తెలిపారు.

23,593 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు

నూజివీడు: మండలంలోని 27 రైతుభరోసా కేంద్రాల వద్ద ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసీ పూర్తయిన రైతుల జాబితాలను ప్రదర్శించామని, వీటిల్లో ఏమైనా దోషాలుంటే వాటిని ఈనెల 29లోగా తెలియజేయాలని వ్యవసాయాధికారి ఆలూరు చాముండేశ్వరి పేర్కొన్నారు. మండలంలోని పోలసానపల్లిలో శుక్రవారం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు, పంచాయతీ కార్యదర్శికి తమ అభ్యంతరాలను తెలియజేయవచ్చన్నారు. వీటిని పరిశీలించిన అనంతరం తుది జాబితాను ఈనెల 30న ప్రదర్శిస్తామన్నారు. మండలంలో 6,566మంది రైతులకు సంబంధించి 23,593 ఎకరాలు ఈ క్రాప్ నమోదు పూర్తి చేశామన్నారు.

నేడు బాస్కెట్‌బాల్ ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 28, 29తేదీలలో జేఎన్‌టీయూకే జోన్ బాస్కెట్‌బాల్ (మెన్ అండ్ ఉమెన్) ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్-2023-24 నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నమెంట్ శనివారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. చీఫ్ పేట్రన్స్ కళాశాల గౌరవ చైర్మన్ ఎల్.జయప్రకాశ్‌రెడ్డి, చైర్మన్ ఎల్.ఆర్.ఎస్.కే ప్రసాద్‌రెడ్డి, పాట్రన్స్ కళాశాల ప్రెసిడెంట్ జీ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే హరినాథరెడ్డి, ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూకే ఐసీటీ సెక్రటరీ డాక్టర్ జీపీ. రాజు పాల్గొంటారని తెలిపారు.